ప్రజాశక్తి
సోమవారం 20 మార్చి 2023
5
శ్రీకాకుళం

23న 'లా' కోర్సుకు స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో మూడేళ్ల 'లా' కోర్సులో ప్రవేశానికి ఈనెల 23న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు వైస్ ఛాన్సలర్ ఎన్.వెంకటరావు తెలిపారు. వర్సిటీలో లా కోర్సుకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు వచ్చిన తర్వాత ఉన్నత విద్యామండలి బిఆర్ఎయులో మూడేళ్ల లా కోర్సులో స్పాట్ అడ్మిషన్లకు అనుమతి ఇచ్చిందన్నారు. లాసెట్-2022లో ర్యాంకు పొందిన అభ్యర్థులు ఈ స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. మూడేళ్ల లా కోర్సులో ఆసక్తి ఉన్న అభ్యర్థులు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ http://www.brau.edu.in నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాలన్నారు. దరఖాస్తు ఫారానికి సంబంధిత సర్టిఫికెట్లను జత చేయాలని స్పష్టం చేశారు. స్పాట్ అడ్మిషన్లకు వచ్చే వారు రూ.1000 ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని, అడ్మిషన్ పొందాక వర్సిటీ నిర్దేశించిన ట్యూషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఫీజు రాయితీలు వర్తించవన్నారు.

వ్యవ'సాయం' కరువు

- ఏటా బడ్జెట్‌లో తగ్గుతున్న కేటాయింపులు
- సాగునీటి వనరుల అభివృద్ధి శూన్యం
- పెరుగుతున్న పెట్టుబడులు
- అప్పుల్లో రైతులు

దేశానికి రైతే రాజు.. రైతు లేనిదే దేశం లేదని పాలకులు ఊకదంపుడు ఉపన్యాసాలు చెప్పడం తప్ప, వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేసిన దాఖలాల్లేవు. వారిని ఒక ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారు. వ్యవసాయానికి కావాల్సిన రుణాలు, పంటలకు సాగునీటి కల్పన, సాగునీటి వనరుల అభివృద్ధి, పంటకు గిట్టుబాటు ధర, పంట నిల్వ చేసేకునేందుకు కోల్డ్ స్టోరీజీలు ఏర్పాటు, తదితర సమస్యలతో రైతులు అవస్థలు పడుతున్నా.. సర్కారు పట్టించుకున్న సందర్భం లేదు. ఈ నెల 16న ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ అందుకు ఉదాహరణ.

ప్రజాశక్తి - శ్రీకాకుళం

బడ్జెట్‌లో జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగింది. ప్రధానంగా ఉన్న వ్యవసాయరంగానికి ఈ బడ్జెట్‌లో తగిన విధంగా కేటాయింపులు లేవు. వ్యవసాయానికి అవసరమైన సాగునీరు అందించే ప్రాజెక్టుల పూర్తికి ఈ బడ్జెట్‌లో అసలు నిధులు కేటాయించలేదు. వంశధార రిజర్వాయరు నిర్మాణం, కాలువల పనులకు అధికారులు రూ.762 కోట్లు ప్రతిపాదనలు పంపితే రూ.240 కోట్లు కేటాయించారు. ఆఫ్‌షోర్‌ను పూర్తి చేస్తామని చెబుతున్న పాలకులు ఈ బడ్జెట్‌లో రూ.230 కోట్లు అవసరం కాగా, కేవలం రూ.60.12 కోట్లు మాత్రమే కేటాయించారు. ఆఫ్‌షోర్‌ను 2008లో ప్రారంభించారు. నేటికి 15 ఏళ్లు అయ్యింది. ఇలాగే నిధులు కేటాయింపులు జరిగితే మరో 20 ఏళ్లు అయినా ప్రాజెక్టు పూర్తయ్యే పరిస్థితి లేదు. సుమారు రూ.700 కోట్లు అవసరమని అధికారులు చెబుతుండగా, అరకొరగా నిధులు కేటాయిస్తున్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా శ్రీకాకుళంలో 80వేల ఎకరాలకు సాగునీరు అందించొచ్చు. దీనికి అసలు నిధుల కేటాయింపులు లేవు. వంశధార ఫేజ్-2 హైలెవల్ కెనాల్, ఎత్తిపోతల పథకానికి రూ.476 కోట్లు అవసరం కాగా, రూ.180.73 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ రకంగా బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటే జిల్లా వ్యవసాయరంగంలో ఏ విధంగా అభివృద్ధి చెందుతుందో వేరే చెప్పనవసరం లేదు.

ఆ హామీ ఏమైంది

జిల్లాలో అత్యధిక మంది రైతులు జీడి, మామిడి, కొబ్బరి పంటలపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరి కోసం బడ్జెట్‌లో ఏ విధమైన నిధుల కేటాయింపులు లేవు. జీడికి గిట్టుబాటుధర పూర్తిగా ప్రకటించడం లేదు. ధరల స్థిరీకరణ నిధి బడ్జెట్‌లో పెడుతున్నా శ్రీకాకుళంలో జీడి రైతులకు అందులో నుంచి ఒక్కపైసా కూడా కేటాయించలేదు. గిట్టుబాటు ధర కల్పించాలని జీడి రైతులు ఆందోళన చేస్తున్నారు. దీనిపై స్పందించిన మంత్రి అప్పలరాజు అదనంగా రూ.వెయ్యి ఇస్తామని చెప్పి రెండేళ్లు కావస్తోంది. ఇప్పటివరకు ఇచ్చిన దాఖలాల్లేవు. కనీసం ధరల స్థిరకరణ నిధి నుంచి జీడి రైతులకు డబ్బులు ఇచ్చినా ప్రయోజకరంగా ఉంటుంది. జీడి పంటకు వాతావరణం బీమా అమలు చేస్తామని చెప్పారు. ఇప్పటివరకు అమలు చేసిన దాఖలాల్లేవు.. దీంతో జీడి రైతులు ప్రకృతి, వ్యాపారుల దయాదాక్షణ్యాలకు గురై, నష్టపోతున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం లేదు.

పంట వేయడానికి కాదు.. అమ్ముకోవడానికి అప్పులు

వరి పంటను ఈసారి ప్రభుత్వం కొనుగోలు చేస్తామని చెప్పింది. ధాన్యం అమ్ముకోవడంలో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పంటకు పెట్టుబడులు పెట్టడానికి గతంలో అప్పులు చేసిన రైతులు, ఈ సారి పంటను అమ్ముకోవడానికి అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఈ-క్రాప్ పేరుతో రైతులు, కౌలు రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడ్డారు. చివరకు దళారులు, వ్యాపారులకు తక్కువ ధరకు పంటను అమ్ముకోవాల్సి వచ్చింది. మొక్కజొన్న కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెప్తున్నా కొనుగోలు కేంద్రాల ద్వారా ఎక్కడా కొనే పరిస్థితి లేదు. ఈ రకంగా రైతు పండించిన పంటకు ధరలు కల్పించడంలో గానీ, రైతులకు ఆదాయం గ్యారెంటీ చేయడంలోగానీ ప్రభుత్వం రైతులకు భరోసా కల్పించలేకపోతోంది. ఫలితంగా రైతులు రోజురోజుకూ వ్యవసాయం గిట్టుబాటు కాక, వ్యవసాయం వదులుకొని వలసపోతున్నారు. వలసల జిల్లాగా పేరున్న శ్రీకాకుళం జిల్లాలో వ్యవసాయరంగం అభివృద్ధి చేయడం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా యువతకు నిరుద్యోగ సమస్యను పరిష్కరించి, వలసలను అరికట్టవచ్చు. కానీ ప్రభుత్వం ఆ దిశగా ఏ రకమైన ప్రయత్నం చేయడం లేదు. వ్యవసాయాన్ని మరింత నష్టాల్లోకి నెట్టేసే విధంగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయి. దానికి ఈ బడ్జెట్‌లో కేటాయింపులే ఉదాహరణ.

స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలి

చిన్న, సన్నకారు రైతులు అధిక సంఖ్యలో ఉన్న ఈ జిల్లాలో ప్రభుత్వ సహాయం లేకపోతే వ్యవసాయం చేయడం కష్టం. రైతు భరోసాలో రకరకాల నిబంధనల పేరుతో కోతలు పెడుతున్నారు. పెరుగుతున్న ధరలు, వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేయాల్సి వస్తోంది. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు సి2 ప్లస్ 50 ప్రకారం మద్దతు ధరలు ప్రకటించి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. అంతేగానీ, మద్దతుధర నిర్ణయించామని చెప్పడం వల్ల ఏమి ఉపయోగం లేదు. రైతు పెట్టుబడికి 50శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించి, ప్రభుత్వమే కొనుగోలు చేయడం వల్ల రైతులకు మేలు కలుగుతుంది. రైతులు పండించిన కూరగాయలు, ఇతర పంటలకు కోల్డ్ స్టోరేజీలు నిర్మించకపోవడం వల్ల రైతులు ఉన్న మేరకు పంటను నష్టానికి అమ్ముకోవాల్సి వస్తోంది.

-కె.మోహనరావు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

నోటీసును చూపిస్తున్న గోవిందరావు

కూన రవికుమార్‌ను నిర్బంధించిన పోలీసుల

ఉద్యమాలపై ఉక్కుపాదం

- చలో అసెంబ్లీ, మహా ధర్నాకు వెళ్లనీయకుండా నోటీసులు
- పలువురు గృహ నిర్బంధం

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

జిఒ నెంబరు 1 రద్దు చేయాలని కోరుతూ పోరాట ఐక్య వేదిక తలపెట్టిన చలో అసెంబ్లీ, సిఎం క్యాంపు కార్యాలయం ముట్టడి, తమ సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీల చేపట్టిన మహా ధర్నాకు ఎవరూ వెళ్లకుండా పోలీసులతో రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు ఇప్పించింది. ఉద్యమాలపై ఉక్కుపాదం మోపింది. శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని, ప్రజా ఆస్తులకు నష్టం కలిగే అవకాశం ఉన్నందున నిరసనలో పాల్గొనే వారు నేరం చేయడానికి అవకాశం ఉన్నందున ఉద్యమాల్లో పాల్గొన వద్దని సెక్షన్ 149 సిఆర్‌పిసి ప్రకారం నోటీసులు ఇచ్చింది. కాదని ఉద్యమాల్లో పాల్గొంటే సెక్షన్ 151 సిఆర్‌పిసి ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

శ్రీకాకుళంలో ఉంటున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావును గృహ నిర్బంధం చేసింది. ఆదివారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. శ్రీకాకుళంలో ఉంటున్న టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్‌కు పోలీసులు నోటీసులు ఇచ్చి, ఆదివారం రాత్రి గృహ నిర్బంధించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, సిపిఐ సీనియర్ నాయకులు సనపల నర్సింహులు, కొత్తూరు మండలం మెట్టూరులో సిపిఎం నాయకులు గంగరాపు సింహాచలంకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. మహాధర్నాకు వెళ్లనీయకుండా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సుధతో పాటు 1500 మంది అంగన్వాడీలకు పోలీసులు నోటీసులు అందజేశారు.

పలాసలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, సిపిఎం నాయకులు ఎన్.గణపతి, సిపిఐ నాయకులు చాపర సుందర్‌లాల్, చాపర వెంకటరమణ, చాపర వేణుగోపాల్, సిహెచ్ రవి. వై.మురళి, టిడిపి నాయకులు బి.నాగరాజు, డొక్కరి శంకర్‌కు పోలీసులు నోటీసులు అందించారు. గంటకు గంటకు వారి ఇళ్లకు వచ్చి ఫొటోలు తీసుకున్నారు. ఇంట్లో ఉన్నారో లేదో చూసి వెళ్లారు.

ఆమదాలవలస మండలం కంచరాపువానిపేట అంగన్వాడీ కార్యకర్త మాధవికి, సోంపేటకు చెందిన అంగన్వాడీ వి.హేమలత, సిఐటియు నాయకులు హైమావతికి, కవిటిలో పలువురు అంగన్వాడీ కార్యకర్తలకు పోలీసులు నోటీసులిచ్చారు. టెక్కలి మండలం చిన్న నారాయణపురం అంగన్వాడీ కార్యకర్త డి.ఉషారాణి, సంతబొమ్మాళి మండలం పందిరిగుంట అంగన్వాడీ కార్యకర్త కె.కుమారికు ముందస్తు నోటీసులు అందజేశారు. వీరికి నోటీసులు ఇవ్వడం అప్రజాస్వామికమని సిఐటియు నాయకులు షణ్ముఖరావు అన్నారు.

నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

వామపక్షాల నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న గోవిందరావు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు, ప్రజాస్వామ్యవాదులపై ప్రయోగిస్తున్న నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని సిపిఎం సిపిఐ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, బి.శ్రీరామ్మూర్తి అన్నారు. నగరంలోని ఇందిరానగర్‌లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కమిటీ ఆధ్వర్యాన జిఒ 1 రద్దు చేయాలని సోమవారం చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లనీయకుండా రాష్ట్ర ప్రభుత్వం 149 సిఆర్‌పిసి కింద వామపక్ష కార్యకర్తల ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించారు. నిర్బంధాలు ప్రయోగిస్తే గత ప్రభుత్వాలకు పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. అంగన్వాడీ ఉద్యోగులు డిమాండ్ల సాధనకు చలో విజయవాడకు వెళ్లకుండా నోటీసులు ఇవ్వడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. జిఒ 1 రద్దు చేయాలని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వారు డిమాండ్ చేశారు. జిఒ 1ని రద్దు చేసేవరకు పోరాటం కొనసాగుతుందని, ఇటువంటి నిర్బంధాలకు భయపడే ప్రసక్తి లేదన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఖండించాలన్నారు.

చేనేతకు చేయూత అందించాలి

- చేనేత, జౌళి శాఖ ఆర్‌జెడి బి.ధనుంజయరావు
- చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

చేనేత కార్మికులు తయారు చేసే వస్త్రాలను జిల్లా ప్రజలు కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని చేనేత, జౌళి శాఖ ప్రాంతీయ ఉప సంచాలకులు బి.ధనుంజయరావు అన్నారు. న్యూఢిల్లీ చేనేత జౌళి అభివృద్ధి మంత్రిత్వశాఖ సౌజన్యంతో జిల్లా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో చేనేత వస్త్ర ప్రదర్శన, విక్రయాలను స్థానిక టౌన్ హాల్ సమావేశ మందిరంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే వ్యవసాయం తరువాత అతిపెద్ద వృత్తి చేనేతరంగమని అన్నారు. చేనేత కార్మికులను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయని అన్నారు. కార్మికులు తయారుచేసే వస్త్రాలకు మార్కెటింగ్ ప్రధాన సమస్య అని, ఈ సమస్యను అధిగమించి కార్మికులను ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా ఇటువంటి వస్త్ర ప్రదర్శనలను ఏర్పాటుచేసి విక్రయాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు ఈ వస్త్ర ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు. జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఐ.ధర్మారావు మాట్లాడుతూ 8 జిల్లాలకు చెందిన సుమారు 20 సహకార ఉత్పత్తి సంఘాలకు చెందిన అన్ని రకాల వస్త్రాలను ఇక్కడ ప్రదర్శించినట్లు చెప్పారు.

తక్కువ ధరకే లభించే వస్త్రాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బి.ఎం.సింగ్, ఆప్కో డివిజనల్ వాణిజ్యాధికారి సోమేశ్వరరావు, ఆప్కో డిఒ శేఖర్, లీలాకుమార్, ముఖర్జీ, వివిధ సహకార ఉత్పత్తి విక్రయ సంఘాల అధ్యక్షులు, మేనేజర్లు, సేల్స్‌మెన్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న ధనుంజయరావు

లావేరులో తడిసిన మొలకెత్తిన మొక్కజొన్నను వేరు చేస్తున్న రైతు

పలాస: నేలకూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

జిల్లావ్యాప్తంగా వర్షాలు

- లావేరులో తడిచిన మొక్కజొన్న
- పలాసలో నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం విస్తారంగా వర్షాలు కురిసాయి. ఉరుములు, మెరుపులతోపాటు, పలు చోట్ల పిడుగులు పడ్డాయి. పిడుగుపాటుకు టెక్కలిలో మండలం దీపావళిలో 78 గొర్రెలు, మేక పిల్లలు మృతి చెందాయి. బలగలోని భద్రమ్మ కోవెలపై పిడుగు పాడటంతో గోడలు బీటలు వారాయి. లావేరు మండలంలో రోడ్డుపై ఎండబెట్టిన మొక్కజొన్న తడిచిపోయింది. జిల్లాలో అత్యధికంగా మెళియాపుట్టిలో 72.2 మి॥మీ వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా ఇచ్ఛాపురంలో 5.4 మి॥మీ వర్షపాతం నమోదైంది. టెక్కలిలో 55.4 మి॥మీ, హిరమండలంలో 52.5మి॥మీ, పాతపట్నంలో 51.6మి॥మీ నమోదు అయ్యాయి.

మొక్కజొన్నకు నష్టం

లావేరు మండలంలో 7వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. సుమారు 60శాతం పంట రైతుల కోత కోశారు. రోడ్డు పక్కన మొక్కజొన్నను రైతులు ఎండబెట్టారు. రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు రైతులు పంటను టార్పాలిన్‌తో కప్పారు. అయినా పంట తడిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్న బూజుపట్టి, మొలకలు వస్తే వ్యాపారులు కొనుగోలు చేయరని వాపోతున్నారు. పంటను ఎండ బెట్టే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు.

నేలకూలిన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభం

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాశీబుగ్గ హిరావత్ దుకాణం కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, సమీపంలోని విద్యుత్ స్తంభం నేలకూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం కారణంగా రోడ్లు, కాలువ నిర్మాణ పనుల వల్ల మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. మండలంలోని చినంచల, పెదంచల గ్రామాల్లో రైతులు నూర్పులు చేసి ధాన్యం బస్తాలను పంట పొలాల్లో ఉంచడంతో ధాన్యం బస్తాలు వర్షపు నీటిలో తడిచిపోయాయి. దీంతో రైతులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

భద్రమ్మగుడిపై పిడుగు

శ్రీకాకుళం నగరంలోని బలగలోని భద్రమ్మతల్లి ఆలయంపై ఆదివారం వేకువఝామున పిడుగు పడింది. దీంతో ఆలయ గోడలకు బీటలు వారాయి, గుడిపై అమర్చిన విగ్రహాలు ధ్వంసమయ్యాయి. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, మాదారపు వెంకటేష్, సింహాద్రినాయుడు, పాపారావు, తదితరులు ఆలయానికి వెళ్లి పరిశీలించారు. ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదు.

వజ్రపుకొత్తూరు మండలం పూండిలో ఇటీవల సిసి రోడ్డు నిర్మించారు. రహదారి ఎత్తు పెరగడంతో సమీపంలోని అయ్యంగారి బేకరీ, జేసన్ మొబైల్ షాపుల్లోకి వర్షపు, మురుగునీరు చేరింది.

వజ్రపుకొత్తూరు: బేకరీలోకి చేరిన వర్షపునీరు

యువజన సంఘాల బలోపేతమే ఎన్‌వైకె లక్ష్యం

ఎన్‌వైకె కో-ఆర్డినేటర్ వెంకట్ ఉజ్వల్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

యువశక్తిని ఎల్లప్పుడు ఉత్తేజ పరుస్తూ మంచి మార్గాన పయనించడానికి కేంద్ర యువజన మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ద్వారా ప్రాయోజిత కార్యక్రమాలను నిర్వహిస్తోందని నెహ్రూ యువ కేంద్రం కో-ఆర్డినేటరు కె.వెంకట్ ఉజ్వల్ అన్నారు. ఎన్‌వైకె ద్వారా చేస్తున్న కార్యక్రమాలు, సంఘాల బలోపేతానికి చేపడుతున్న చర్యలు, తదితర వివరాలను ఆయన ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.

యువజన, మహిళా సంఘాల బలోపేతానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సామాజిక బాధ్యతతో యువత గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించడానికి సమిష్టిగా సంఘాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. పూర్వం ఈ రకమైన సంఘాలు ఉండేవి. ఇప్పుడు నిస్తేజానికి గురయ్యాయి. మహిళా సంఘాల పనితీరు అలాగే ఉంటోంది. వారి ఆలోచనలకు పదునుపెట్టి సమిష్టిగా ఉంటే వారు సాధించలేనిది ఏమీ ఉండదు. ఈ రకమైన ఆలోచన వారిలో పెంచడానికి ఎన్‌వైకె కృషి చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో ఉండే యువజన సంఘాలను ఇప్పుడు వందల సంఖ్యలోకి చేర్చగలిగాం.

వీరికి ఏవిధంగా తోడ్పాటు అందిస్తున్నారు?

జిల్లాలో ఉన్న యువజన సంఘాలు, మహిళా మండళ్లను గుర్తించి వాటిని బలోపేతం చేసేందుకు తోడ్పాటు అందిస్తున్నాం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కొత్తగా యువజన సంఘాలు స్థాపించాలనుకునే వారు నెహ్రూ యువ కేంద్రం వాలంటీర్లను సంప్రదిస్తే వారే మార్గనిర్దేశం చేస్తారు. మండల స్థాయిలో ఎంపిడిఒలు, తహశీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు తోడ్పాటు అందిస్తున్నారు.

ఏటా యువజనోత్సవాలు నిర్వహిస్తున్నారు? వాటి ప్రాధాన్యత ఏమిటి?

యువతను ఉత్తేజ పరచడానికి స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఏటా జాతీయ స్థాయిలో యువజనోత్సవాలు నిర్వహించడం జరుగుతోంది. యువ ఉత్సవ్‌లో యువజన సంఘాలు, మహిళా మండలి ప్రతినిధులు యువత పాల్గొంటున్నారు. ఏటా జిల్లాస్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయసుగల యువతకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నాం. వారిలో పోటీతత్వం పెంచుతున్నాం. నెహ్రూ యువ కేంద్రం ద్వారా యువతను మంచి మార్గాన పయనించేందుకు తోడ్పాటు అందించగలుగుతున్నాం.

53,867 మంది విద్యార్థులకు లబ్ధి

శ్రీకాకుళం అర్బన్: జగనన్న విద్యాదీవెన కింద జిల్లాలో 53867 మంది విద్యార్థులకు లబ్ధి కలిగింది. ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరులో సిఎం జగన్మోహన్‌రెడ్డి డిబిటి విధానంలో ఆదివారం జగనన్న విద్యాదీవెన నిధులను విడుదల చేశారు. జిల్లాలో 53,867 మంది విద్యార్థులు ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్, తదితర కోర్సులు చదువుతుండగా 48,345 తల్లుల ఖాతాల్లో 2022-23 విద్యా సంవత్సరానికి మొదటి విడతగా నగదును జమచేశారు. మొత్తం రూ.31.40 కోట్లు తల్లుల ఖాతాల్లో వేశారు. శ్రీకాకుళం కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌ఛార్జి ఉప సంచాలకులు, బిసి కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు ఆర్.గడ్డెమ్మ, గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు బి.నగేష్, బిసి సంక్షేమ అధికారి ఇ.అనురాధ, డిపిఎం పొట్నూరు శరత్ విద్యార్థులకు నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

Government of Andhra Pradesh
Endowments Department

E-PROCURMENT TENDER NOTICE:

Improvements to Sri Uma Neelakanteswara Swamy Temple, Siddhantham (V), L.N.Peta (M), Srikakulam Dist.

NIT NO.COE/1295/2022-5 Dt.12.12.2022.

For further details log onto **website "https://tender.apeprocur ment.gov.in"** For further details contact **Ph.9121918251**

EXECUTIVE AUTHORITY
Sri Uma Neelakanteswara Swamy Temple,
Siddhantham (V), L.N.Peta (M), Srikakulam Dist.

మహారాజ శ్రీ సోంపేట అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జికోర్టువారి దివ్యసముఖమునకు
OS 48/2021

గేదెల కుమారస్వామి .....వాది
కల్లా మోహన్ ....ప్రతివాది
To
Kalla Mohan, S/o Lt Jogarao, age 42 years, owner - cum - driver of four wheeler C Passenger Vehicle residing at Do.No. 3-4, Kattivaram village, P.O: Kanchili, Kanchili Mandal, Srikakulam District

పై నెంబరు దావాలో యిందు మూలంగా మీకు తెలియజేయునది ఏమనగా పై కోర్టువారి ఆర్డరు ప్రకారం ఎన్ని పర్యాయములు మీకు కోర్టుద్వారా సమన్లు మరియు నోటీసులు పంపించిననూ మీరు ఉద్దేశ్యపూర్వకంగా నిరాకరించినందున పై కోర్టువారు Substitute సర్వీసు మూలంగా ఈ పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసు జారీ చేస్తూయున్నాము.

కాబట్టి యీ దావాలో ప్రతివాది అయిన మీరు కోర్టుకు హాజరు నిమిత్తం **తే 21-3-2023దీన ఉదయం 10-30 ని॥**లకు స్వయంగా గానీ వకీలు ద్వారాగానీ హాజరై మీ అభ్యంతరములు తెలియజేయగలరు. లేని యెడల మీకు పరోక్షంగా తీర్పు చెప్పబడును.

ఇట్లు
ఎం.చలపతిరావు
న్యాయవాది, సోంపేట

IN THE HONOURABLE COURT OF THE III ADDL.JUNIOR CIVIL JUDGE CUM PROHIBITION AND EXCISE AT SRIKAKULAM.
O.S.288/2021

Between:
1.Panili Jagannadham And others --Plaintiffs
And:
Tripurana Venkata Ratnam --Defendant

To,
Tripurana Venkata Ratnam w/o Ramesh,Ex-MLC. R/at Door 1-4/6-3-1,Santhinagar colony, Nagavali river bund,Srikakulam city and district.

Please take notice that the above **OS.288/2021** is posted to **04/04/2023** for your appearance. you are hereby informed by a of this publication to attend on the said date at **10:30 AM** in person or through advocate before the above sed court if you fail to appear the Honourable court will be decided the matter in your absence.

(Order of the Honourable court)

SAMPATHIRAO VASUDEVA RAO
Advocate, Srikakulam
Cell No.9440513541

సోంపేట : రామారావుకు కేక్ తినిపిస్తున్న జెడ్‌పిటిసి యశోద

ఎమ్మెల్సీ 'నర్తు'కు ఘన స్వాగతం

ప్రజాశక్తి- సోంపేట

స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికై తొలిసారిగా నియోజకవర్గానికి వచ్చిన నర్తు రామారావుకు వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానుల నుంచి ఘన స్వాగతం లభించింది. ఆదివారం ఉదయం కొర్లం జాతీయ రహదారి వద్దకు పెద్ద సంఖ్యలో నాయకులు, అభిమానులు చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన రామారావుకు పూలమాలలు వేసి అభినందనలు తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, జెడ్‌పిటిసి తడక యశోద తదితరులు కేక్ తినిపించి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం మోటార్ వాహనాలతో భారీ ర్యాలీగా ఇచ్ఛాపురం వెళ్లారు. మార్గమధ్యంలో సోంపేటలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నందిగాం : ఎమ్మెల్సీ నర్తు రామారావును జాతీయ రహదారిపై ఉన్న వైసిపి కార్యాలయం వద్ద యాదవ సంఘం ఆధ్వర్యాన ఆదివారం స్వాగతం పలికారు. యాదవ సంఘం ప్రతినిధి చిన్ని జాగారం రామారావుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. అనంతరం సిఎం జగన్మహన్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్సీ పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో యాదవ్ సంఘం ప్రతినిధులు నర్తు శేషగిరిరావు, బి.సోమేశ్వరరావు, పల్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిందే

ప్రజాశక్తి- ఆమదాలవలస

మోహనరావు

ప్రజలకు ప్రశ్నించే అవకాశం ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిందేనని ఎపి సిఎంఎ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ప్రశ్నించే అవకాశం లేకుండా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా విడుదల చేసిన జిఒ నంబరు 1ని తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ జిఒను తీసుకురావడం రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని తెలియజేస్తుందని మండిపడ్డారు. జిఒ నంబరు 1ని రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20న పోరాట ఐక్యవేదిక నాయకులు చలో అసెంబ్లీని తలపెట్టిన నాయకులకు పోలీసులు ముందుగానే 149 సిఆర్‌పి నోటీసులు జారీ చేయడం చట్ట విరుద్ధమని, ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరికాదని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం కల్పించిందని, దానిని అడ్డుకోవడం తగదని అన్నారు. పౌర హక్కుల నేతలను, న్యాయవాదులను, మాజీ ఎమ్మెల్యేలను అడ్డుకోవడం సమంజసం కాదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిరంకుశ జిఒను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

'ప్రజాదరణ కోల్పోయిన వైసిపి'

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రంలో మేధావి వర్గం ఓటర్లుగా ఉన్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి చీత్కారాన్ని ఎదుర్కొన్నారని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు అన్నారు. నగరంలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి బలపర్చిన అభ్యర్థులు విజయం సాధించడానికి వైసిపిపై ఉన్న ప్రజావ్యతిరేకతే కారణమన్నారు. నాలుగేళ్లుగా ఉత్తరాంధ్ర ప్రజలను మోసం చేసిన సిఎం జగన్మోహనరెడ్డి అబద్దాలతో మూడురాజధానులంటూ మోసం చేశారన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు, నిరుద్యోగ యువత జగన్ పాలనపై విసిగిపోయారని విమర్శించారు. ఈఎన్నికతో వైసిపి పతనం మొదలైందన్నారు.

మల్లు స్వరాజ్యం, నంబూద్రిపాద్

ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం, కేరళ మాజీ సిఎం ఇఎంఎస్ నంబూద్రిపాద్‌ల ఆశయ సాధనకు కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అన్నారు. నగరంలోని సిపిఎం కార్యాలయంలో స్వరాజ్యం ప్రథమ, నంబూద్రిపాద్ 25వ వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) తరపున నల్గొండ జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం నుంచి మల్లు స్వరాజ్యం రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని అన్నారు. పేదలు, మహిళల సమస్యలపై ఆమె అను నిత్యం పోరాడిన తీరు స్ఫూర్తిదాయమన్నారు. నిజాం అరాచకాలను ఎదిరించారని,

మల్లు స్వరాజ్యం, నంబూద్రిపాద్ చిత్రపటాలకు నివాళ్లర్పిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

పదేళ్ల వయసులోనే మాక్సిం గోర్కి నవల 'అమ్మ'ను చదివి స్ఫూర్తి పొంది కమ్యూనిస్టు పార్టీలో చేరారని అన్నారు. 13 ఏళ్ల వయసులోనే కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా నేతృత్వాన సాయుధ పోరాటానికి సిద్ధపడ్డారని అన్నారు. నంబూద్రిపాది విలక్షణ స్థానం, ప్రజా ఉద్యమాలలో అగ్రభాగాన నిలుస్తూ మరోవైపు ఎన్నికల్లో ఘన విజయాలు సాధించి భారత రాజకీయాల్లో కీలకమైన మలుపునకు కారణమైన యోధుడు అని అన్నారు. ఎన్నికల ద్వారా కేరళ ముఖ్యమంత్రి పీఠమెక్కిన తొలి కమ్యూనిస్టుగా ఆయనను ప్రపంచం గుర్తుంచుకుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు నిర్వహించడమే వారికిచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి శ్రీరామ్మూర్తి, ఐద్వా జిల్లా కన్వీనర్ ఎ.లక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, ఐలు నాయకులు డి.రమణారావు, కె.అప్పారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరీష్ చందు, సిపిఐ నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయ కుతంత్రాలను తిప్పికొట్టారు

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు

మాట్లాడుతున్న రవికుమార్

అమరావతి రాజధానిగా నిర్ణయం జరిగిన తరువాత కూడా ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విశాఖ రాజధాని పేరుతో పన్నిన పన్నాగాన్ని రాష్ట్ర ప్రజలు తిప్పికొట్టారని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని తండ్యాంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. దురుద్దేశంతో పన్నిన కుట్రను పసిగట్టి ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలలో వైసిపికి విజ్ఞులైన విద్యావంతులు తగిన బుద్ధి చెప్పారన్నారు. వైసిపి దుర్మార్గాలకు మూడు ప్రాంతాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు ద్వారా ప్రజలు ఇచ్చిన తీర్పే ఈ ఫలితాలన్నారు. 2024లో జరిగే సాధారణ ఎన్నికల్లో వైసిపికి వ్యతిరేకంగా ఇవే ఫలితాలు ప్రతిబింబిస్తాయని అన్నారు. పశ్చిమ రాయలసీమ ఫలితం కడపలోనే కాదు పులివెందులలోను జగన్మోహన్‌రెడ్డి పని అయిపోయిందని సూచిస్తోందని అన్నారు. ప్రభుత్వానికి ప్రజాస్వామ్యంపై ఏ మాత్రం గౌరవం లేదని, అందుకే అసెంబ్లీలో ప్రజా సమస్యలపై నిలదీస్తున్న టిడిపి ఎమ్మెల్యేను సస్పెండ్ చేశారని విమర్శించారు. ఈయనతో పాటు మండల టిడిపి అధ్యక్షులు చిగులపల్లి రామ్మోహన్ ఉన్నారు.

జ్ఞాపికలను అందజేస్తున్న ఇఒ హరిసూర్యప్రకాష్

ఆదిత్యుని సన్నిధిలో ప్రముఖులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని ఆదివారం పలువురు ప్రముఖులు సందర్శించారు. సందర్శించిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, వారిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిజిఎం రంగరాజన్, ఎపి విశ్రాంత డిజిపి నండూరి సాంబశివరావు, న్యూ ఢిల్లీకి చెందిన భారత రక్షణశాఖ జాయింట్ సెక్రటరీ పి.హరిప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి వేర్వేరుగా సందర్శించారు. అలాగే కేరళ రాష్ట్రానికి చెందిన సీనియర్ ఐఎఎస్ అధికారి కుడుంబశ్రీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మిషన్ జాఫర్ మాలిక్ కూడా సందర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలికారు. అనంతరం వారికి స్వామి వారి జ్ఞాపికలను ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మైక్‌సెట్ వితరణ

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని శివరాంపురం పంచాయతీ కోటియకొండపేటలో పాలపోలమ్మ ఆలయాన్ని ఇటీవల ప్రతిష్టించారు. ఈ ఆలయానికి కోటిపల్లికి చెందిన మాజీ సర్పంచ్, నియోజికవర్గ యాదవ సంఘ నాయకులు చిన్ని జోగారావు దంపతులు మైక్ సెట్‌ను ఆదివారం విరాళంగా అందజేశారు. సేవా కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొనారి ఎర్రయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

మైక్‌సెట్‌ను అందజేస్తున్న జోగారావు

టిడిపి పూర్వ వైభవానికి కృషి

పలాస : టిడిపి పూర్వ వైభవానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పిలుపునిచ్చారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 12 వార్డులో కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి నాయకుల దౌర్జన్యాలను ఐకమత్యంగా తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రంలో ఎమ్మెల్సీలుగా తెలుగుదేశం పార్టీ బలపర్చిన అభ్యర్థులు గెలుపు వైసిపి పతనానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో శరవేగంగా పరిణామాలు మారుతున్నాయని, రాబోయేది టిడిపి ప్రభుత్వమని జోస్యం చెప్పారు. ముందుగా శిరీషకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, రాష్ట్ర బిసి ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల రావు, గురిటి సూర్యనారాయణ పాల్గొన్నారు.

శిరీషను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

రక్తదానంతో ప్రాణదానం

నందిగాం: రక్తదానం చేసి మరొకరికి ప్రాణదాతలు కావాలని ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి పిలుపునిచ్చారు. పలాస ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యాన నందిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ముందుగా ఈ శిబిరాన్ని ఎంపిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ మేరకు పది మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం ఎంపిపి, వైద్యాధికారి కె.అనితకుమారి రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పలాస ప్రభుత్వాస్పత్రి వైద్యులు చిన్నంనాయుడు, రఘురామమూర్తి, సిబ్బంది గున్న కాళి, శ్రీకాకుళం రిమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి- పలాస

మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

కాశీబగ్గలో జరజాపు లలితాజ్యోతి (35) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు... కాశీబుగ్గ పాత జాతీయ రహదారి బజాజ్ షోరూం వద్ద ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో జరజాపు జయవర్ధన్ తన భార్య లలితాజ్యోతి, పిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. జయవర్ధన్ బజాజ్ షోరూమ్‌లో పార్టనర్‌గా ఉన్నారు. ఉదయం భార్యాభర్తల మధ్య చిన్నపాటి తగాదాలు జరిగింది. అనంతరం భర్త కాశీ నుంచి వస్తున్న తన తల్లిదండ్రులను తీసుకొచ్చేందుకు బరంపురం వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చేసరికి భార్య ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించారు. అనంతరం శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాశీబుగ్గ ఎస్ఐ గోపాలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి మూడేళ్ల కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

తండ్రీకొడుకులపై దాడి

కొత్తూరు : మండలంలోని నివగాంకు చెందిన ఇస్సయి మిన్నారావు, ఆయన కుమారుడు జ్ఞానేశ్వరరావులపై అదే గ్రామనికి చెందిన నాగవంశం లక్ష్మీనారాయణ దాడి చేశారని ఎస్ఐ ఎం.గోవింద్ తెలిపారు. ఆదివారం ఇంటి ముందు చెత్త విషయమై ఇరువురి మధ్య ఘర్షణ జరిగిందన్నారు. దీంతో లక్ష్మీనారాయణ కోపోద్రిక్తుడై కత్తితో తండ్రీకొడుకులపై దాడి చేయడం గాయపడ్డారని అన్నారు. వెంటనే కుటుంబ సభ్యులు కొత్తూరు సామాజిక ఆస్పత్రికి తరలించారని అన్నారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లో భద్రపరుస్తున్న అధికారులు

చేరిన 'పది' ప్రశ్నాపత్రాలు

ప్రజాశక్తి- పొందూరు

ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు, ఎపి మోడల్ స్కూల్, తాడివలస జెడ్‌పి హెచ్ఎస్‌లోని పరీక్షా కేంద్రాల్లో నిర్వహించే ఈ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచినట్లు ఎంఇఒ పి.వి.రామరాజు, కస్టోడియన్, జాయింట్ కస్టోడియన్లు వై.అరుణకుమారి, పూజారి హరిప్రసన్న తెలిపారు. కార్యక్రమంలో ఛీప్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు పట్నాన రాజారావు, కుప్పిలి రవికుమార్, సత్యనారాయణ, పూజారి రవి పాల్గొన్నారు.

విద్యార్థినితో మాట్లాడుతున్న డిఇఒ పగడాలమ్మ

ఒత్తిడికి గురికావద్దు

డిఇఒ పగడాలమ్మ

ప్రజాశక్తి- నందిగాం

పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థినీ విద్యార్థులు ఒత్తిడి గురికాకుండా లక్ష్యం వైపు దృష్టి సారించాలని డిఇఒ గార పగడాలమ్మ సూచించారు. మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు ఆదివారం సాయంత్రం వెళ్లారు. విద్యార్థుల చదువుతున్న తీరుని అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అంతకుముందు ఉపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు, ఉపాధ్యాయులు బాలక రామారావు, తులసీప్రసాద్, రత్నం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

చిరుధాన్యాల సాగుపై అవగాహన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

వైఎస్ఆర్ క్రాంతి పథకం ద్వారా చిరుధాన్యాలు సాగుపై రైతులు దృష్టిసారించాలని ఎటిఎం గురుబెల్లి నారాయణరావు అన్నారు. వెలుగు సిబ్బంది ఆధ్వర్యాన అంతర్జాతీయ చిరుధాన్యాల మహోత్సవంలో భాగంగా ఆదివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక కంద్రవీధి నుంచి గోపినాథపురం వరకు ర్యాలీ సాగింది. చిరుధాన్యాలు ఆహారంలో తీసుకోవడం ద్వారా అనారోగ్యాలు భారినపడకుండా ఉంటామని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిసిలు పద్మ, వరదరాజు, సరోజిని, నీలవేణి, విఒఎ మహేశ్వరి, డ్వాక్రా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రూ.5 వేలు ఆర్థికసాయం

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, 19వ వార్డు ఉంకిలి దాలయ్య అనారోగ్యానికి గురై ఆపరేషన్ చేయిం చుకున్నారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ ప్రతినిధి శిష్ట గోపి రూ.5 వేలు ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు బగాది సింహాచలం, సీపాన లోకేష్, పిట్టా భాస్కరరావు, సీపాన ఈశ్వరరావు, బగాది పురుషోత్తం, మార్పు కృష్ణ, కోనారి ఆది, మార్పు చిన్న, నెయ్యలరాజు, బోనెల శ్రీకాంత్ పాల్గొన్నారు.

నిజాయతీతోనే సహకార సంఘాల బలోపేతం

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సహకార సంఘాలు అభివృద్ధి చెందాలంటే నిజాయతీ కలిగిన నాయకులు ఉండాలని ఎపి సహకార యూనియన్ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో మత్స్యకార సహకార సంఘాల చైర్మన్లు, పాలకవర్గ సభ్యులకు నాయకత్వ అభివృద్ధి శిక్షణా కార్యక్రమం ఆదివారం రెండో రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సహకార సంఘాలు, మత్స్యకారులు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలంటే సహకార సంఘాల ప్రాముఖ్యతను పాలకవర్గం గుర్తించాలన్నారు. పాలకవర్గం తీసుకునే నిర్ణయాలు, సమావేశాల్లో చేసే తీర్మానాలు మత్స్యకారుల ప్రయోజనాలు కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. చాలా సహకార సంఘాలు ఆర్థికంగా వెనుకబడి ఉన్నాయని, సహకార సంఘాల ఆవశ్యకత, విధులు, హక్కులు తెలుసుకుని మత్స్యకారుల అభివృద్ధికి నాయకత్వం కృషి చేయాలని కోరారు. తరచూ సమావేశాలు నిర్వహిస్తూ, సత్వర నిర్ణయాలు తీసుకోవడం ద్వారా మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి సాధ్యపడుతుందని చెప్పారు. సహకార సంఘాల సమావేశాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై రామదాసు సహకార శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఎడి సంతోష్‌కుమార్, సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పూజారి జానకిరాం, ఎం.శ్రీనివాసరావు, సహకారశాఖ సిబ్బంది, వివిధ మత్స్యకార సహకార సంఘాల చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి

ప్రజాశక్తి- కవిటి

విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని ఎంఇఒ ధనుంజయ మజ్జి, ఎస్ఐ కె.రాము అన్నారు. భారతీయ విద్యా కేంద్రం కవిటి, జగతి, శిలగాం పాఠశాలల వార్షికోత్సవ వేడుకలు కవిటి బివికె పాఠశాల ఆవరణలో ఆదివారం అంగరంగా వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ ప్రస్తుతం విలువలతో కూడిన విద్య అవసరమన్నారు. విద్యతో పాటు నేటి సామాజిక స్థితగతులు, సమాజంలో విలువలపై ప్రాథమిక దశలోనే విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన శారీరక, పిరమిడ్స్, సాహసకృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అర్జున్ పాత్రో, బల్లెడ కృష్ణారావు, భావన నారాయణమూర్తి, అరంగి రాజు, పూడి నీలాచలం, గొనప దాసప్ప, బివికె పరిపాలన అధికారి కన్నన్, అనిల్, ఢిల్లేశ్వరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒ ధనుంజయ మజ్జి

నవధాన్యాలు సాగుచేద్దాం

కొత్తవలసలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

తొలకరి వర్షాలు పడకముందు రైతులందరూ నేలలో 30 రకాలకు పైగా విత్తనాలు వేసుకొని సాగు చేయడంతో నేలలో కర్బన శాతం పెరిగి నేల సారవంతంగా మారుతుందని ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ నక్క చిరంజీవిరావు అన్నారు. మండలంలోని చేపేనపేట యూనిట్ పరిధిలోని జి.కె.వలస, కొరపాం, నిమ్మతొర్లాడ, కొత్తవలస, తొగరాం గ్రామాల్లోని రైతులు ఆదివారం ప్లకార్డులు చేతబట్టి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతులకు నవధాన్యాల సాగు పద్ధతులపై వివరిస్తూ అవగాహన కల్పించారు. నవధాన్యాలు సాగు చేద్దాం - నేల తల్లిని కాపాడుదాం అంటూ వినూత్నంగా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తవలస మాజీ సర్పంచ్ గురుగుబెల్లి అప్పలనాయుడు, రోణంకి జనార్ధనరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతి, లక్ష్మి, కృష్ణవేణి, జానకిరామ్ పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్‌కు 'షూ గైడ్'

ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ (ఫైల్)

ప్రజాశక్తి- పలాస

పలాస మండలంలోని బ్రాహ్మణతర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సైన్స్ ఉపాధ్యాయుడు కొయ్యల శ్రీనివాసరావు మార్గదర్శకత్వంలో తొమ్మిదో తరగతి చదువుతున్న బి.సాల్మన్‌రాజు రూపొందించిన 'షూ గైడ్' ప్రాజెక్టు రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైంది. తొలుత అంతర్జాలం ద్వారా జిల్లాస్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో 240 ప్రాజెక్టులు పోటీపడ్డాయి.

24 రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. అందులో షూ గైడ్ ప్రాజెక్టు ఒకటి. దృష్టిలోపం కలవారికి ఎటువంటి ఆరోధం లేకుండా సరైన మార్గనిర్దేశనానికి, మహిళలు పిల్లలకు ఆపదలో ఉన్నప్పుడు ట్రాక్ చేయడానికి అలాగే సైనికులు, పోలీసులు బాంబులను గుర్తించడానికి ఈ షు గైడ్ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది. సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శనలో ఈ ప్రాజెక్టును తిలకించిన కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, డిఇఒ జి.పగడాలమ్మ ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వెైంకుఠరావు, ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

మానసిక ఆందోళనను జయించాలి

వజ్రపుకొత్తూరు: విద్యార్థులు మానసిక ఆందోళనను జయించాలని కాశీబుగ్గ రూరల్ సిఐ జి.శంకరరావు అన్నారు. పూండి సాయి వినీత్ విద్యా సంస్థ వ్యవస్థాపకులు చాపర లీలా కోదండరావు అధ్యక్షతన పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు దృష్ట్యా ఒత్తిడికి గురికాకూడదన్నారు. చదువు, పరీక్షలు జీవితంలో ఒక భాగమని, క్రమశిక్షణతో కూడిన అభ్యాసన విజయానికి సోపామని అన్నారు. విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకోవడానికి సరైన అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సంస్థ డైరెక్టర్, విశ్రాంతి డిప్యూటీ డిఎంహెచ్ఒ లీలా మాట్లాడుతూ లక్ష్య సాధనకు విద్యార్థులు నిరంతరం కృషి చేయాలన్నారు. విద్యతోనే సమాజ దృక్పథంలో సరైన మార్పులు వస్తాయన్నారు. ఈ మేరకు సిఐ, ఎస్ఐ మధుసూదనరావులను పాఠశాల యాజమాన్యం దుశ్శాలువ కప్పి సన్మానించింది. అనంతరం విద్యార్థులు జానపద సినీ గేయలకు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.కైలాసరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీను, ఎల్.ధనరాజ్, అధ్యాపకులు బి.ధర్మారావు ఎస్.షణ్ముఖరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ శంకరరావు

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని పారిశుధ్యం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ప్రతిభ కనబరిచిన మహిళలకు ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత-23 అవార్డులకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ కె.అప్పలనాయుడు ఒక ప్రకటనలో కోరారు. మరుగుదొడ్ల నిర్వహణ, మురుగనీటినీ శుద్ధీకరణ చేసి తిరిగి ఉపయోగించడం, తడి, పొడి చెత్త సేకరణ, చెత్తను తరలించు పద్ధతులు, పొడి చెత్తను వినూతన రీతిలో వినియోగించడం, చెత్త నుంచి సంపద తయారీ, చెత్తలో కళాకృతులు, సేంద్రీయ ఎరువు తయారీ, స్వచ్ఛతపై అవగాహన కల్పించడం, సాంకేతిక నూతన ఆవిష్కరణ విభాగాల్లో కృషి చేస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు, మైక్రో ఎంటర్‌ప్రైజెస్, నాన్ గెజిటెడ్ ఆర్గనైజేషన్ తదితర విభాగాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈ నెల 22లోగా మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో దరఖాస్తులను అందజేయాలని తెలిపారు. అవార్డులకు ఎంపికైన మహిళలకు జూన్ 5న నిర్వహించనున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో అవార్డులను అందజేస్తామని తెలిపారు.

గ్రంథాలయాల్లో 'చదవడం మాకిష్టం'

లావేరు : ప్రతి విద్యార్థీ ఖాళీ సమయాల్లో గ్రంథాలయానికి వచ్చి చిన్న చిన్న పుస్తకాలు, కథలు చదవాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. లావేరు శాఖాగ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులతో ఆదివారం కథలు చదివించారు. ఈ సందర్భంగా షర్మిలకు ప్రథమ, శ్యామ్‌కు ద్వితీయ, లలితకు తృతీయ బహుమతులు వచ్చాయి. గ్రంథాలయం తరుపున బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య పాల్గొన్నారు.

లావేరు : చదువుతున్న విద్యార్థులు

బలగ : ప్రతి విద్యార్థీ కొంత సమయాన్ని గ్రంథాలయానికి కేటాయించి గ్రంథాలయంలోని చిన్న చిన్న కథల పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేన్ అన్నారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయులు త్రినాథరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు కొన్ని కథలు చెప్పి వాటి గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో సహాయకులు కె.అనిత పాల్గొన్నారు.

సోంపేట : బారువ శాఖాగ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. పోటీ పరీక్షలతో పాటు విద్యా సంబంధిత పుస్తకాల కోసం గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి ధర్మారావు కోరారు. కార్యక్రమంలో అధ్యాపకుడు జీవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

బలగలో కథలు చెబుతున్న త్రినాథరావు

కొత్తూరు : స్థానిక శాఖాగ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి కథలు, పుస్తకాలు, నవలు చదివించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయంలోని పుస్తకాలను చదువుకోవాలని గ్రంథాలయాధికారి టి.ఇందిర కోరారు. కార్యక్రమంలో డి.లక్ష్మి పాల్గొన్నారు.